క్లుప్తంగా

రక్తదానం.. ప్రాణదానం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: రక్తదానం ప్రాణదానమని వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ అన్నారు. వైఎన్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రక్తదానంపై ప్రజల్లో ఇంకా పలు అపోహలు ఉన్నాయన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యానికి వచ్చే ఇబ్బందిలేదన్నారు. రక్తదానంతో మరొకరి ప్రాణం నిలపాచ్చన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, అకడమిక్ అడ్వయిజర్ ఆర్వీ సుబ్బారావు, డీన్ గంధం రామకృష్ణ, ఎన్ఎస్ఎష్ ఆఫీసర్లు యాకోబ్, సోమేశ్వరి, ఎన్సీసీ ఆఫీసర్ శ్యాం బాబు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు మేకా శ్రీరామ్‌సురేష్, వీడీసీ పాపారావు, సుంకర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపులోనే కాజ్‌వే



కనకాయలంకలో వరద నీటిలో కాజ్‌వే మీద ప్రయాణిస్తున్న గ్రామస్తులు

యలమంచిలి: గోదావరిలో వరద తగ్గినా కనకాయలంక వద్ద కాజ్ వే మీద వరద ప్రభావం ఇంకా ఉంది. గత నెల 22న ముంపునకు గురైన కాజ్ వే 16 రోజులుగా ముంపులోనే ఉంది. అయితే కాజ్ వే మీద కేవలం ఒకడుగు నీరు మాత్రమే ఉండడంతో ప్రజలు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. వరద పూర్తిగా తగ్గడంతో వరద ప్రభావిత లంక గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలకుండా అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

పాలకొల్లు తహసీల్దార్‌గా దుర్గాకిషోర్



పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు మండల తహసీల్దార్‌గా యడ్ల దుర్గాకిషోర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కోఆర్డినేషన్ సెక్షన్‌లో పని చేసి, బదిలీపై పాలకొల్లు వచ్చారు. కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యతలు నిర్వర్తిస్తూ నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని తెలిపారు.

తగ్గిన గోదావరి ప్రవాహ ఉధృతి



వలంధర్‌రేవు వద్ద సాధారణ స్థితిలో ఉన్న గోదావరి ప్రవాహ ఉధృతి

నరసాపురం: వశిష్ట గోదావరి నీటిమట్టం సాధారణ స్థితికి చేరుకుంది. స్థానికంగా ప్రవాహ వేగం తగ్గింది. గోదావరి శాంతించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణ పరిధిలో గోదావరి తీరం వెంబడి పొన్నపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లో ముంపు భయం పూర్తిగా తొలగిపోయింది. మాధవాయిపాలెం రేవులో పంటు రాకపోకలను మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో పునరుద్ధరించారు. దీంతో పెద్ద ఎత్తున గోదావరి జిల్లాల మధ్య ప్రజల రాకపోకలు ప్రారంభమయ్యాయి. వలంధర్ రేవు వద్ద భక్తులు స్నానాలు చేయడానికి అనుమతి ఇచ్చారు. వలంధర్ రేవు నీరు తొలగడంతో బురదమయంగా మారింది.

నరసాపురం టౌన్ సీఐగా యాదగిరి

నరసాపురం: నరసాపురం టౌన్ సీఐగా బి.యాదగిరి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన యాదగిరి ఎస్సైగా తూర్పుగోదావరి జిల్లా అయినవిల్లి, రామచంద్రపురం ప్రాంతాల్లో పని చేశారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ఆయనకు సీఐగా పదోన్నతి కల్పించి, నరసాపురం టౌన్‌కు నియమించారు. ఈ సందర్భంగా సీఐ యాదగిరి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

మెరుగైన సేవలందించాలి

పాలకోడేరు: ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా నిత్యావసర వస్తువులు అందించాలని పాలకోడేరు మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నడింపల్లి భారతి విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆమెను మంగళవారం మండలంలోని రేషన్ డీలర్లు మర్యాద పూర్వకంగా కలుసుకుని సత్కరించారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేష్ఠం

అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించిన ఐసీడీఎస్ సిబ్బంది



యలమంచిలి: తల్లిపాల వారోత్సవ ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు

మొగల్తూరు: తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠమని సీడీపీవో బి.ఊర్మిల తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు సులువుగా జీర్ణమవడంతో పాటు సరైన పోషకాహారం అందుతుందన్నారు. బిడ్డ పుట్టిన ఆరు నెలలు కేవలం తల్లి పాలు మాత్రమే అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.విజయ కుమారి, అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలా చేపట్టాలి

యలమంచిలి: బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వలన తల్లీ, బిడ్డలకు కూడా మంచిదనే విషయాన్ని ప్రతీ మహిళకు అర్థమయ్యే విధంగా ఒక ఉద్యమంలా చేపట్టాలని దొడ్డిపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ చంద్రరేఖ కోరారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం దొడ్డిపట్ల, మేడపాడు, యలమంచిలి గ్రామాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేసి, అనంతరం ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రరేఖ మాట్లాడుతూ బిడ్డలకు పాలు ఇవ్వడం వలన తల్లులకు రొమ్ము, గర్భకోశ, అండాశయ క్యాన్సర్ రాదన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహ్మద్ హసీనా, నాగరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ సీతామహాలక్ష్మి, హెల్త్ విజిటర్ ఎస్ నిర్మలకుమారి, ఎంపీహెచ్ఈఓ ఎం జగ్గారావు, హెల్త్ సూపర్‌వైజర్ కె అచ్యుత్ కిరణ్ అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలి

పెనుగొండ: పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లిపాలివ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రుతుకుమారి చెప్పారు. వడలిలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో సూపర్‌వైజర్ రుతుకుమారి మాట్లాడుతూ బిడ్డకు 6 నెలల వయసు వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలనీ, ఇతర పదార్థాలేమీ తినిపించకూడదన్నారు. అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగ నిరోధక శక్తి

పాలకొల్లు అర్బన్: తల్లిపాలు పట్టడం వలన బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని టి.రూపాదేవి అన్నారు. మండలంలోని అరట్లకట్ట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అలాగే మిషన్ శక్తి 100 కార్యక్రమంలో భాగంగా కిషోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. కిషోరబాలికలు శారీరక మార్పుల పట్ల ఆందోళన చెందనవసరం లేదన్నారు. అలాగే లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవాలని వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ లిఖిత, అంగన్‌వాడీ టీచర్ కె.సత్యవతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తిల్లపూడిలో....

మండలంలోని తిల్లపూడి పాటిగరువు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.మంగ, ఉపాధ్యాయులు అప్పన మాధవరావు, గంటా సుబ్బారావు, అంగన్‌వాడీ టీచర్లు జేపీఎన్ లక్ష్మి, కె.వెంకటలక్ష్మి, ఎస్వీ లక్ష్మి, కె.అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లు: తల్లి పాల విశిష్టతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



మొగల్తూరు: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



పెనుగొండ: తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆలమూరులో విష జ్వరాలు



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆలమూరు జ్వర పీడితులు

పెనుమంట్ర: మండలంలోని ఆలమూరులో విష జ్వరాలు సోకి పలువురు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జ్వరాల తీవ్రతపై ఈ నెల నాలుగో తేదీన ఎస్సీ కమిటీ హాలులో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినా, అధిక శాతం రోగులు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నారు. ఎక్కువ శాతం భీమవరం, పాలకొల్లు, తణుకు ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా జ్వరాలపై స్థానిక వైద్యాధికారులు పూర్తి సమాచారం ఇవ్వడానికి నిరాకరిస్తుండగా గ్రామంలో జూలై 9 నుంచి గ్రామ పంచాయతీ ఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా చేసిన సర్వేలో 17 మంది జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించామని, అందులో ఇద్దరికి డెంగీ నిర్ధారణ కావడంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పంచాయతీ విస్తరణ అధికారి రాంప్రసాద్, కార్యదర్శి నాగేంద్ర కుమార్ మంగళవారం పత్రికా ప్రకటనలో తెలిపారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

పెనుగొండ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఈ నెల 8, 9, 10 తేదీల్లో ఢిల్లీలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు సి.చెన్నయ్య ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నా విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ పిలుపునిచ్చారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య రిట్ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధి కూలీల వేతన బకాయిలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

నరసాపురం రూరల్: ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు చెల్లించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కవురు పెద్దిరాజు విమర్శించారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నరసాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఉపాధి కూలీలకు మూడు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించడంలోనూ, రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించడంలో శ్రద్ధ చూపడం లేదని పెద్దిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో సుమారు రూ .2.75 కోట్ల బకాయిలు రావాల్సి ఉందన్నారు. వెంటనే కూలీల వేతన బకాయిలు విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గుబ్బల నాగేశ్వరరావు, పిల్లి కామేశ్వరరావు, కడలి రవి, శ్రీనివాసరావు, వేణు, విజయలక్ష్మి తాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలి



ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీపీవో ఆర్.విక్టర్

పెనుమంట్ర: ఆలమూరులో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని, జ్వరాల తీవ్రత తగ్గే వరకు ఆరోగ్యశాఖతో మాట్లాడి మెడికల్ క్యాంపు కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఆలమూరులోని పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న రోగులను స్వయంగా కలిసి వారి సమాచారం అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంకలో లిక్విడ్ క్లోరినేషన్ సిస్టం ప్రారంభించి బ్లీచింగ్ కలపకుండానే లిక్విడ్ క్లోరినేషన్ పైప్‌లైన్ ద్వారానే పంపించాలని ఆయన కార్యదర్శిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆలమూరులో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులను, మందులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో పి.పద్మజ, ఈవోపీఆర్డీ రాంప్రసాద్, గ్రామ సర్పంచ్ మేడపరెడ్డి వెంకటరమణ, త్రిమూర్తులు, కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఎంపీటీసీ మృతి

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం నార్త్ టూ ఎంపీటీసీ కొమ్మూరి సూరయ్య నాయుడు (74) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. సూరయ్య నాయుడు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఆయన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య చెంచులక్ష్మి, కుమార్తె, ఇద్దరు కుమారులు కలరు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ బలపర్చడంతో పేరుపాలెం నార్త్-2 ఎంపీటీసీగా గెలుపొందారు. ఆయన మృతికి మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ ఎమ్మెల్యేలు బందారు మాధవ నాయుడు, కొత్తపల్లి సుబ్బారాయుడు, ఎంపీపీ అందే సూర్యావతి భుజంగరావు, తదితరులు సంతాపం తెలిపారు.

జాగ్రత్తలు పాటిస్తే కోళ్ల పెంపకంలో లాభాలు



కోళ్ల పెంపకంపై మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు జవహర్‌హుస్సేన్

ఉండి: కోళ్ల పెంపకంలో జాగ్రత్తలు పాటిస్తే లాభాలు వాటంతటవే వస్తాయని పశుసంవర్ధక శాఖ భీమవరం ఉపసంచాలకుడు డాక్టర్ జవహర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో పెరటి కోళ్ల పెంపకంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జవహర్‌హుస్సేన్, వెంకటరామన్నగూడెం బఫెల్లా రిసెర్చ్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగరాజ కుమారి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జున రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జవహర్‌హుస్సేన్ మాట్లాడుతూ వ్యాపార పరంగా పెంచే కోళ్లు, గుడ్లుపెట్టేవి (లేయర్స్), మాంసం (బ్రాయిలర్స్) కోళ్ల పెంపకంలో పలు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. డాక్టర్ నాగరాజకుమారి మాట్లాడుతూ దేశీయ కోళ్ల పెంపకం కుటీర పరిశ్రమగా నిర్వహించవచ్చని తెలిపారు. కోళ్ల షెడ్లు ఏర్పాటు చేసేటప్పుడు గాలి వెలుతురు సమృద్ధిగా ఉండేలా చూడాలన్నారు. ప్రతి కోడికి ఒకటి రెండు చదరపు అడుగులు విస్తీర్ణం ఉండేట్టు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. కోళ్ల దాణా తయారీలో మొక్కజొన్న, సోయా, వేరుశనగ, వరి, తవుడుతో పాటు ఖనిజ లవణాలు, విటమిన్లు కలుపుకుని ఉపయోగించాలని తెలిపారు. కోళ్లకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ దెబోరా మెస్సియానా, డాక్టర్ ఏ శ్రీనివాసరావు, పీ వినయలక్ష్మి, బి.రజిత,బీ రామకృష్ణ, భీమవరం, పాలకోడేరు, నరసాపురం, ఉండి, ఆకివీడు, పెనుమంట్ర, వీరవాసరం, పాలకొల్లు, మొగల్తూరు తదితర మండలాల నుంచి ఔత్సాహికులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి చర్యలు



కలవపూడిలో చెత్త సేకరణకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కాళ్ల: గ్రామంలో పారిశుద్ధ్య సమస్యను అధిగమించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని కలవపూడి గ్రామానికి చెందిన పలువురు గ్రామ పెద్దలు తెలిపారు. కాళ్ల మండలం కలవపూడి గ్రామ పంచాయతీలో చెత్త సేకరణకు సర్పంచ్ గేదెల జాన్, గ్రామ మంతెన వెంకట శివాజీరాజు, మంతెన పెదనరసింహరాజు ఆర్థిక సహకారంతో ట్రాక్టర్ ఏర్పాటు చేశారు. దాతలు అందించిన ట్రాక్టర్‌ను గ్రామ పెద్దల సమక్షంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత శివాజీరాజు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలనే ఆలోచనతో సుమారు రూ.4 లక్షలతో ట్రాక్టర్ కొనుగోలు చేసి పంచాయతీకి అందించినట్లు తెలిపారు. ఏడాది పాటు ట్రాక్టర్ నిర్వహణ ఖర్చు కూడా తామే భరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దాతలను పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.

విద్యార్థుల సంఖ్య పెంచండి

విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి

పెనుమంట్ర: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచకపోతే రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు మూతపడే అవకాశం ఉందని కాకినాడ విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ జి.నాగమణి అన్నారు. మంగళవారం పెనుమంట్ర మండలంలోని మార్టేరులో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు బాధ్యతగా విద్యార్థులకు పాఠాలు చెప్పాలని ఆమె హెచ్చరించారు. అర్హత లేకుండా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ స్కూల్స్‌పై కఠిన చర్యలు తప్పవని ఆమె అన్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆమె కోరారు. విద్యార్థినీ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరిస్తూ గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. ప్రతీ విద్యార్థి యూనిఫామ్ తప్పనిసరిగా ధరించి పాఠశాలకు వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు టెస్ట్ బుక్స్ లేకపోతే ఎంఈవోపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఎంఈవో రోజుకొక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేయాలన్నారు. మధ్యాహ్నం భోజనంలో విద్యార్థుల సంఖ్య 50% కన్నా తక్కువగా ఉంటుందని కనీసం 70 శాతానికి పెంచాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు కలిసి పని చేసి విద్యార్థుల్లో క్రమ శిక్షణ పెంచాలన్నారు. బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనన్నారు. కార్యక్రమంలో ఏపీసీ శ్యాంసుందర్ ఏడి సత్యనారాయణ, తాడేపల్లిగూడెం తణుకు భీమవరం డీవైఈవోలు రవీంద్ర భారతి, మురళి సత్యనారాయణ, శ్రీనివాసరావు, రాష్ట్ర ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ రామకోటేశ్వరరావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా కన్వీనర్ ఆర్ఐపీ మనోహర్ సుధాకర్, జిల్లాలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం.. ఆరోగ్యం పదిలం



ప్రకృతి సాగులోని మిరప చేనుని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: సేంద్రీయ విధానంలో సాగు చేసే పంటలు మానవాళికి ఎంతో మేలు చేస్తాయని జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు చెప్పారు. మండలంలోని వాలమర్రు, కాపవరం, అరట్లకట్ట, చింతపర్రు గ్రామాల్లోని సేంద్రీయ వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పంటలను ఆయన పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. చింతపర్రులో గుత్తుల రాము సాగు చేస్తున్న చేపల చెరువు, పంట చేను, కాపవరంలో రైతు నాగపండు వేసిన మిరప చేను, అరట్లకట్టలో రైతు రాంబాబు, వాలమర్రులో రైతు సలోమాన్ సాగు చేస్తున్న కాయగూరల పంటలను వెంకటేశ్వరరావు పరిశీలించి పలు సూచనలు చేశారు. విత్తనాలు భూమిలో నాటిన దగ్గర నుంచి పంట దిగుబడి వచ్చే వరకు అవలంభిస్తున్న పద్ధతులను రైతులను అడిగి తెలుసుకున్నారు. పంటలకు రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రీయ ఎరువుల వినియోగంపై రైతులు వివరించారు. ఆయన వెంట ప్రకృతి వ్యవసాయ విభాగం డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ నూకరాజు, జిల్లా కో ఆర్డినేటర్ అరుణకుమారి, బాల గంగాదేవి ఉన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు వీరాస్వామి, మురళీకృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ



రైతులకు సబ్సిడీ విత్తనాలు సరఫరా చేస్తున్న దృశ్యం

యలమంచిలి: గుంపర్రులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు నష్టపోయిన రైతులకు మంగళవారం 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. 370 మంది రైతులకు 120 క్వింటాళ్ల విత్తనాలు అందజేశారు. ఇంకా అవసరమైన రైతులుంటే సంబంధిత గ్రామ రైతు సేవా కేంద్రంలో విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, 30 కిలోల బస్తాకు సబ్సిడీ పోను రూ.227 చెల్లించి తీసుకెళ్లాలని మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి కోరారు.

హిరోషిమాపై దాడి భయానక దుర్ఘటన



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ

పాలకొల్లు సెంట్రల్: హిరోషిమా నగరంపై అమెరికా అణుబాంబు దాడి ప్రపంచ చరిత్రలోనే ఒక భయానక దుర్ఘటన అని ఏఎస్ఎస్ఎం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిరోషిమా దుర్ఘటన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ మాట్లాడుతూ 6 ఆగస్టు, 1945న హిరోషిమా నగరంపై అమెరికా మొట్టమొదటి సారిగా అణుబాంబుతో దాడి చేసిందన్నారు. ఈ సంఘటనలో 50 వేల మంది ప్రజలు ప్రాణాలు పోగొట్టుకోగా 35 వేల మంది తీవ్రంగా గాయపడ్డారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పార్థసారథి, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ విజయలక్ష్మి, దుర్గేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

పాలకొల్లు అర్బన్: మండలంలోని అరట్లకట్ట గ్రామ మాజీ సర్పంచ్ ముత్యాల సుబ్బారాయుడు (84) మంగళవారం వయో భారంతో మృతి చెందారు. సుబ్బారాయుడు 1970 నుంచి 1981 వరకు గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. ఆయన మృతి పట్ల సర్పంచ్ రుద్రరాజు శ్రీనివాసరాజు, సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, ఎంపీటీసీ సంతాపం వ్యక్తం చేశారు.

